16082024-MAI-06_Layout 1 8/16/2024 1:54 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# కోల్‌కతా హత్యాచారం

**కోల్‌కతా** ప్రభుత్వ వైద్య విద్యాసంస్థ ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ఆవరణలో అత్యాచారం, ఆపై హత్య జరగడం అత్యంత శోచనీయం. కామాంధుల కర్కశత్వానికి ఓ యువ వైద్యురాలు బలైంది. చట్టాలు పదునెక్కినా దారితప్పిన మగవారి నుంచి మహిళలకు భద్రత లభించని పరిస్థితులు ఇంకా మన సమాజంలో తచ్చాడుతూనే ఉన్నాయని ఈ సంఘటన సూచిస్తున్నది. సమాజం తలదించుకోవాల్సిన ఈ ఘటనపై సహజంగానే తీవ్రస్థాయిలో ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా బెంగాల్‌లో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఒక వ్యక్తి మాత్రమే లైంగికదాడిలో పాల్గొన్నాడని ముందుగా వార్తలు వెలువడ్డాయి. వైద్యపరీక్షల్లో సామూహిక లైంగిక దాడి జరిగినట్టు ఆధారాలు లభించడంతో జనాగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. నిరసనలు చాలావరకు శాంతియుతంగానే జరుగుతున్నప్పటికీ అక్కడక్కడా హింసాకాండ చోటుచేసుకున్నది.

ఘటనా స్థలంలో వైద్యులు బీభత్సం సృష్టించడంతో పోలీసులు లాఠీ చార్జీ, బాష్పవాయు గోళాలు ప్రయోగించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. దాడిలో ఎమర్జెన్సీ వార్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో నేరస్థలంలోని కీలక సాక్ష్యాధారాలకు నష్టం వాటిల్లినట్టు పోలీసులు చెప్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాజకీయాల నీలినీడలు ప్రసరించడం శోచనీయం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాతవైరానికి కొత్త ముడిసరుకుగా ఈ ఘటన మారుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మమత నేతృత్వంలోని బెంగాల్ ప్రభుత్వానికి ఈ ఉదంతం ఓ అగ్నిపరీక్షలా మారింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని తృణమూల్ సర్కారుకు మధ్య సంబంధాలు ఉప్పు-నిప్పులా కొనసాగుతున్న నేపథ్యంలో హత్యాచార ఉదంతం ఆ వైరానికి ఆజ్యం పోస్తున్నది. రాష్ట్ర పోలీసులు గడువులోగా కేసును పరిష్కరించకపోతే కేసును సీబీఐకి అప్పగిస్తానని సీఎం మమత ప్రకటించిన నేపథ్యంలో ఆ గడువు కంటే ముందుగానే హైకోర్టు జోక్యంతో కేసు కేంద్ర సంస్థ చేతుల్లోకి పోయింది.

ఈ ఘటన విషయంలో ప్రభుత్వం, పోలీసులు స్పందించిన తీరు, నిరసనకారులతో టీఎంసీ నేతలు వ్యవహరిస్తున్న శైలి ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేదనే విమర్శలు వినవస్తున్నాయి. పోలీసులు సకాలంలో స్పందించలేదనే ఆరోపణలూ వచ్చాయి. చివరికి కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ చేతికి వెళ్లడం కీలక మలుపు. దీంతో టీఎంసీ ప్రభుత్వం మొత్తంగా, విశేషించి సీఎం మమత ఆత్మరక్షణలో పడ్డట్టుగా కనిపిస్తున్నది. బెంగాల్‌లో పట్టుకోసం కేంద్రంలోని బీజేపీ సర్కారు దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చూస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ఉదంతం విషయంలోనూ అదే జరుగుతున్నది. ప్రధాని మోదీ ఎర్రకోట ప్రసంగంలో మహిళలపై జరిగే నేరాలను ప్రస్తావించడం గమనార్హం. జరిగిన ఘటన ఘోరాతిఘోరమైనదనే విషయంలో రెండో అభిప్రాయానికి తావులేదు. ఘటనతో సంబంధమున్న నేరస్థులందరినీ పట్టుకుని, న్యాయస్థానంలో నిలబెట్టి శిక్షలు వేయించాల్సిన అవసరమున్నది. సీబీఐ సకాలంలో పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపితేనే అది సాధ్యమవుతుంది. మరి సీబీఐకి అలాంటి చరిత్ర ఉన్నదా?

# ప్రపంచబ్యాంక్ పడగనీడన తెలంగాణ

**స్వాతంత్ర్య దినోత్సవం నాడు గోల్కొండ కోట మీద మువ్వన్నెల జెండా ఎగరవేసాక తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడిని ఇటీవలే కలిసామని, త్వరలోనే ఆ సంస్థ నుండి అప్పులు తీసుకొస్తామని చాలా ఆనందంగా చెప్పారు.**

**దేశమంతా వలస పాలన నుండి విముక్తి సంబురాలు జరుపుకుంటున్న రోజునే తెలంగాణ పరాధీన అవుతున్నదనే ప్రకటన రావడం ఎంతటి విరోధాభాస?**




**కొణతం దిలీప్**

సరిగ్గా 24 నాలుగేళ్ల క్రితం, ఇదే ఆగస్టు నెలలో ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకు చంద్రబాబు నాయుడు కరెంటు చార్జీలు పెంచితే, దాన్ని తగ్గించాలని నిరసన వ్యక్తం చేస్తున్న సామాన్య ప్రజలపైకి పేలిన తూటాలు, కారిన రక్తాలు, పోయిన ప్రాణాలు అన్నీ నా కళ్ల ముందు సినిమా రీల్లా గిర్రున తిరిగాయి.

ఆ చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి వచ్చీరాగానే చేస్తున్న ప్రపంచబ్యాంక్ జపం, ఆ సంస్థ నుండి అప్పులు తేవడానికి సిద్ధం చేస్తున్న భారీ ప్రాజెక్టుల వెనుక ఉన్న కుట్రల గురించి తెలంగాణ సమాజం మేలుకోకపోతే జరిగే నష్టం అంతా ఇంతా కాదు.

**చంద్రబాబుతో ప్రపంచబ్యాంక్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన ప్రయోగం వికటించి చివరికి ఆయన పదవే ఊడిపోయాక దాదాపు రెండు దశాబ్దాలు ఈ ప్రాంతంలో పెద్దగా ఆ సంస్థ ఉనికి కనపడలేదు. మరీ ముఖ్యంగా తెలంగాణలో అయితే కేసీఆర్ దృఢ సంకల్పం వల్ల ప్రపంచబ్యాంక్‌ను అడుగుపెట్టనీయలేదు. 2014 నుంచి 2023 మధ్య మౌలిక వసతుల కల్పన కోసం రుణాలు అవసరమైనా దేశీయ బ్యాంకులు, రుణ వితరణ సంస్థల వద్దకే వెళ్ళింది తప్ప ఏనాడూ ప్రపంచబ్యాంక్ రుణాలు తీసుకోలేదు కేసీఆర్ ప్రభుత్వం.**



అయితే ప్రపంచబ్యాంక్ నుండి రుణాలు తీసుకుంటే జరిగే నష్టమేమిటో, అసలా రుణాల వెనుక జరిగే కుట్రల కథలేమిటో ఈ తరానికి పెద్దగా అవగాహన లేదు. అందువల్లనే రేవంత్ సర్కార్ వారిని తక్కువ వడ్డీకి రుణాలు వస్తాయని మభ్యపెట్టొచ్చు అనే నమ్మకంతో ఉన్నదనిపిస్తున్నది.

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అస్తవ్యస్తంగా తయారైన ప్రపంచ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకంటూ 1944లో అమెరికా ప్రోద్బలంతో మొదలైంది ప్రపంచబ్యాంక్. కానీ అది రానురానూ పేదదేశాల వనరులను దోచి అమెరికా వంటి అగ్రరాజ్యాల, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చే సంస్థగా రూపాంతరం చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవసరం ఉన్నా లేకున్నా ఇబ్బడిముబ్బడిగా రుణాలిచ్చి, ఆ దేశాలు అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేయడం. ఇచ్చిన అప్పులతో నడిచే ప్రాజెక్టుల్లో బహుళజాతి కంపెనీలకు, మధ్య దళారులకు ప్రయోజనం కలిగేలా చేయడం ప్రపంచ బ్యాంక్ విధానం. అంతేకాదు రుణాలిచ్చిన దేశాల్లో పాలకులు నియంతలైనా, దుర్మార్గులైనా, అవినీతిపరులైనా ప్రపంచబ్యాంక్ పట్టించుకోదనే విమర్శలున్నాయి. చిలీలో అగస్టో పినోషె, నికరాగువాలో అనస్టాసియో సొమోజా, రొమేనియాలో నికొలాయ్ సీసెస్క్యూ, కాంగోలో మొబుటు, బ్రెజిల్, టర్కీ దేశాల్లో మిలిటరీ నియంతృత్వాలకు ప్రపంచబ్యాంక్ నిస్సిగ్గుగా అండగా నిలబడి అనేక విమర్శలు ఎదుర్కొన్నది.

పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత వంటి పడికట్టు పదాలతో పేద దేశాలపై వల విసిరే ప్రపంచబ్యాంక్, ఆయా దేశాలు అప్పుల ఊబిలో చిక్కుకోగానే స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ లోన్‌ల పేరిట ఒక దుర్మార్గమైన పన్నాగం పన్నుతుంది. ఈ లోన్ల కోసం ప్రపంచబ్యాంక్ పేద దేశాల్లో పెట్టిన షరతులు చూడండి - విద్య, వైద్యం, ప్రజారవాణా, విద్యుచ్ఛక్తి తదితర రంగాలను ప్రైవేటుకు అప్పజెప్పాలి; ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేయాలి; నీటిపారుదల మొదలు అన్ని రంగాల్లో యూజర్ చార్జీలు ప్రవేశపెట్టాలి; గనులు బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయాలి, మార్కెట్లను బహుళజాతి కంపెనీలకు బార్లా తెరవాలి, ఇలా... ఎన్నో.

> **స్వతహాగా ప్రగతిశీల భావాలు కలిగిన తెలంగాణ సమాజం, బుద్ధిజీవులు మరోసారి ఈ గడ్డమీదికి ప్రపంచబ్యాంకును, వారి తాబేదార్లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న రేవంత్ సర్కార్ ప్రయత్నాలను తిప్పికొట్టాలి. తెలంగాణ మరోసారి పరాధీన కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే!**

**ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాదిమంది అభాగ్యులు; విద్య, వైద్యం ఖరీదైపోయి దాన్ని కొనలేక పోయిన కోట్లాదిమంది అసహాయులు; బహుళజాతి కంపెనీల మైనింగ్‌తో జరిగిన విధ్వంసం వల్ల గూడు కోల్పోయిన గిరిజనులు; ప్రపంచబ్యాంక్ అప్పుల వలకు చిక్కి నాశనమైన దేశాల్లో ఎక్కడ చూసినా మీకు కనిపించే దృశ్యాలు ఇవే.**

1990ల వరకూ కేవలం దేశాలకు మాత్రమే అప్పులు ఇచ్చే ప్రపంచబ్యాంకు చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా ఒక రాష్ట్ర ప్రభుత్వానికి అప్పులు ఇవ్వడం ప్రారంభించింది. మిగతా చోట్ల ఉపయోగించిన ఎత్తుగడలే ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఉపయోగించింది వరల్డ్ బ్యాంక్. అనవసరమైన అప్పుల్ని చంద్రబాబు సర్కారుకు ఇవ్వజూపి, బదులుగా ఇక్కడ విద్యుత్ రంగాన్ని, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయించింది. బ్యాంక్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డును ట్రాన్స్‌కో జెన్‌కోగా విభజించి, ఆ తరువాత దశలవారీగా ప్రైవేటుకు అప్పజెప్పే ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం మొదలుపెట్టింది.

యేటా విద్యుత్ చార్జీలు పెంచాలనే ప్రపంచ బ్యాంక్ షరతును చంద్రబాబు ప్రభుత్వం అమలుజేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజాగ్రహం పెల్లుబికింది. రాష్ట్రమంతటా రాజుకున్న విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమం చివరికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమంతో తారాస్థాయికి చేరింది. ఆగస్టు 28, 2000 నాడు అనేక ఆంక్షలను ఛేదించుకుని బషీర్‌బాగ్ చేరుకున్న ఆందోళనకారుల మీద చంద్రబాబు ప్రభుత్వ పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడం వల్ల ముగ్గురు యువకులు మరణించగా అనేక మంది గాయపడ్డారు. ఆనాటి విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమమే ప్రపంచబ్యాంక్ జీతగాడు అనే బిరుదు చంద్రబాబుకు ప్రసాదించింది. చివరికి ఆయన పీఠాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసింది.

తెలంగాణ ముఖ్యమంత్రిగా చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి నియామకం అయిన కొద్ది రోజులకే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.16,634 కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాజెక్టును తొలుత అమాంతం మూడు రెట్లు పెంచి రూ.50,000 కోట్లతో చేపడతాం అని ప్రకటించిన రేవంత్ రెడ్డి, మూడు నెలలు గడిచే సరికి ఆ అంచనాను ఏకంగా పది రెట్లకు పెంచి రూ. లక్షా యాభై వేల కోట్లకు చేర్చడంతో తెలంగాణ సమాజం నివ్వెరపోయింది. ఇంతలోనే ఆయన అమెరికా పర్యటనకు బయలుదేరడం, అక్కడ ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో కలవడం చకచకా జరిగిపోయాయి. ఆ రోజు జరిగిన చర్చల అనంతరం మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ప్రపంచబ్యాంక్ రుణం తీసుకుంటామని రేవంత్ సర్కారు ప్రకటించింది. ప్రాజెక్టు అంచనాలు కొద్ది నెలల్లోనే పదిరెట్లు పెంచడం, దానికి ప్రపంచబ్యాంక్ రుణం తీసుకుంటాం అని ప్రకటించడం పక్కా కుట్రపూరిత ప్రణాళికతోనే జరిగిందని ఇప్పుడు స్పష్టమవుతున్నది.

**రేవంత్ రెడ్డి మొదలుకొని కాంగ్రెస్ నాయకులంతా ప్రపంచబ్యాంక్ రుణాలు తక్కువ వడ్డీకి దొరుకుతాయి అనే అందమైన అర్ధసత్యాన్ని పదేపదే వల్లెవేసి తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కానీ వారు చెప్పని విషయం ఏమిటంటే ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల రుణాలు డాలర్ డినామినేషన్లో ఉంటాయి. రూపాయి బలహీనపడ్డ ప్రతిసారీ వడ్డీ సంగతేమో కానీ అసలు మొత్తమే భారీగా పెరుగుతుంది. రుణాలివ్వడానికి ప్రపంచ బ్యాంక్ పెట్టే షరతులతో తెలంగాణను పీల్చి పిప్పి చేయడం ఖాయం. ఇలాంటి రుణాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల్లో విద్యుత్ చార్జీల పెంపుతో పాటు ఆర్టీసీ ప్రైవేటీకరణ వరకూ ఉండొచ్చు.**

స్వతహాగా ప్రగతిశీల భావాలు కలిగిన తెలంగాణ సమాజం, బుద్ధిజీవులు మరోసారి ఈ గడ్డ మీదికి ప్రపంచబ్యాంకును, వారి తాబేదార్లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న రేవంత్ సర్కార్ ప్రయత్నాలను తిప్పికొట్టాలి. తెలంగాణ మరోసారి పరాధీన కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే!

# బీసీలు బలి జీవులేనా..!



**మధు యాదవ్ నూకల**
**63033 43359**






తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ సామాజిక, ప్రజాస్వామిక అభ్యుదయ విధానాలను పథకాల రూపంలో ప్రకటించి తెలంగాణ సమాజాన్ని ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. బీసీల పట్ల గతంలో చేసిన అనేక తప్పిదాలను సరిదిద్దుకునే ప్రయత్నంగా అవి కనిపించాయి. కానీ, తీరా అందలమెక్కాక ఆ పార్టీ అసలు స్వరూపం బయటపడింది. రాష్ట్రంలో అధికార మార్పు కోరుకున్న ఆ పార్టీ నాయకులు.. ఇచ్చిన హామీలను నెరవేర్చి వెనుకబడిన కులాల జీవితాల్లో మార్పు రావాలని మాత్రం కోరుకోవడం లేదు. కాలేల్కర్ కమిషన్ నుంచి మండల్ కమిషన్ సిఫారసుల అమలు వరకు బీసీల విషయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం క్షమార్హం కానిది.

అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలే నేడు ఆ పార్టీ మెడకు ఉచ్చులా బిగుస్తున్నాయి. ముఖ్యంగా బీసీల ఓట్లు కొల్లగొట్టడానికి ఇచ్చిన హామీలు ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండలా మారుతున్నాయి. అయితే వాటిని నిలబెట్టుకునే విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధి చింతాకుమందం కూడా కనిపించడం లేదు. బీసీలను ఆ పార్టీ ఇప్పటికీ విస్మరిస్తూనే ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపుతో మొదలైన ఇది కొనసాగుతూనే ఉన్నది. బీసీలకు బీఫాంలు ఇచ్చినా గెలవలేరని.. అగ్రకులాలకే టికెట్లు ఇస్తామన్నట్టు ఆ పార్టీ వ్యవహరించిన తీరును మరువకముందే నామినేటెడ్ పోస్టుల్లోనూ హస్తం పార్టీ వంచించింది. కులగణన, సామాజిక న్యాయం అంటూ రాహుల్‌గాంధీ దేశమంతటా తిరుగుతుండగా.. ఇక్కడి నాయకత్వం మాత్రం బీసీలను అణగదొక్కాలని చూస్తున్నది.

వెనుకబడిన తరగతులకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడో బుట్టదాఖలు చేసింది. కులగణన చేపట్టి, బీసీల రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఎనిమిది నెలలైనా ఆ ప్రక్రియను చేపట్టలేదు. అంతేకాదు, బీసీ కులాల సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున కేటాయిస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించి అసెంబ్లీ సాక్షిగా వంచించింది.

కులవృత్తులకు ప్రతి మండల కేంద్రంలో వృత్తి బజార్లు ఏర్పాటు చేసి, ఉచితంగా షాపులు కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదు. బీఆర్‌ఎస్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తూనే.. 100 రోజుల్లోపే మరో విడత గొర్రెల పంపిణీ చేస్తామని మాటిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక మొత్తం పథకమే విఫలమైందని చేతులెత్తేయడం సబబు కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీకి సంబంధించి 157 సహకార సంఘాల్లో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లెక్కన రుణమాఫీ కూడా విఫలమైందని ప్రభుత్వం ప్రకటించాలి.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ అంశాన్ని ఎటూ తేల్చకుండానే ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఉద్యమానికి బీసీలు సమాయత్తమవుతున్నారు. శ్రామిక కులాలన్నీ ఏకమై రోడ్డెక్కే రోజు దగ్గర్లోనే ఉన్నది. బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చిన నాడు రాష్ట్ర ఆర్థిక రంగం పూర్తిగా స్తంభించిపోవడం ఖాయం. కల్లు మండువన గౌడన్నలు, గొర్ల మందన గొల్లకురుమలు, చాకలి రేవున రజకులు, చేపల చెరువున ముదిరాజులు, కొలిమిన కమ్మరులు, మట్టి తట్టా పనుల వద్ద వడ్డెర ఉప్పరివారు.. ఇలా ఎవరికివారు, ఎక్కడికక్కడ సబ్బండ కులాలు ఉద్యమ పిడికిలి బిగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. సర్దార్ సర్వాయి పాపన్న, పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య, మారోజు వీరన్న, బెల్లి లలితల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని 'మేమెంతో మాకంత' అంటూ ఆర్థిక, రాజకీయ వాటాలు దక్కే వరకు పార్టీలకతీతంగా బీసీలందరూ ధిక్కారపు స్వరాలుగా నిలవాల్సిన సమయమిది. అమాయక కులాలని, రాజకీయ చైతన్యం లేని వర్గాలని అనుకుంటూ మన వాటాను కూడా పరాన్నజీవుల్లా దండుకుంటున్నవారికి బీసీ కులాల బలమేమిటో చూపించాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పట్టుబట్టి సాధించుకోవాల్సిన బాధ్యత కూడా బీసీ కులాలపైనే ఉన్నది.






## ఇది వారి కుట్రే!

ఆర్జీ కార్ హాస్పిటల్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. మేం కూడా గతంలో ఎన్నో ఆందోళనలు చేశాం. కానీ, ఇలా ఎప్పుడూ చేయలేదు. హాస్పిటల్ ధ్వంసంలో విద్యార్థుల పాత్ర ఏమీ లేదు. ఇది బయటివారి పని. టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ, లెఫ్ట్ పార్టీలు కుట్ర పన్నాయి. ఆ పార్టీల జెండాలను నేనూ చూశా.

**- మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**

# బీఆర్‌ఎస్‌పై కుట్రలు కొత్త కాదు

**ఉద్యమమే ఊపిరిగా పురుడుపోసుకున్న.. కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షల ప్రతిరూపమై నిలిచిన.. ప్రత్యేక తెలంగాణ సాధనే ఏకైక లక్ష్యంగా పోరుసలిపిన.. సబ్బండ వర్గాలను, సకల జనులను కదిలించిన.. 'నై తెలంగాణ' అన్నోళ్లతోనే 'జై తెలంగాణ' అనేలా చేసిన పార్టీ గులాబీ పార్టీ. ఉద్యమం నాటి నుంచి పునాదులతో సహా పెకిలించాలని, నామరూపాలు లేకుండా చేయాలని చూసినా.. రాజకీయ ప్రలోభాలతో బలహీనపరచాలని కుట్రలు పన్నినా.. వాటన్నింటినీ తట్టుకుని తన వ్యూహాలతోనే తెలంగాణను సాధించిన పార్టీ బీఆర్‌ఎస్. ఒక్కమాటలో చెప్పాలంటే బీఆర్‌ఎస్ లేకుంటే తెలంగాణే లేదు.**



**సంపత్ గడ్డం**
**78933 03516**



తెలంగాణ అస్తిత్వ ప్రతీక బీఆర్‌ఎస్‌పై మరోసారి కుట్రలు జరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఉద్యమ పార్టీ చెక్కు చెదరకపోవడం, సంస్థాగతంగా మరింత బలోపేతంగా మారుతుండటంతో 'విలీన' కుతంత్రం తెరపైకి వస్తున్నది. మరో పార్టీలో బీఆర్‌ఎస్ విలీనమవుతుందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, వారి కుట్రలకు ఆదిలోనే అడ్డుకట్ట పడింది. వారు ఎన్నివిధాలుగా విష ప్రచారం చేస్తున్నా ప్రజలు ఉద్యమ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారు. రెండు జాతీయ పార్టీల కుట్రలను తిప్పికొడుతున్నారు.

గులాబీ పార్టీ అంటేనే ప్రజల పార్టీ. అది అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిత్యం ప్రజల కోసం కొట్లాడుతూనే ఉంటుంది. మొన్నటికి మొన్న మేడిగడ్డ కుంగిందని సాకులు చెప్తూ కాంగ్రెస్ పాలకులు గోదావరి జలాలను సముద్రం పాలుచేస్తుంటే.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మేడిగడ్డను సందర్శించి కాళేశ్వరం జలాల ఎత్తిపోత షురూ చేయించారు. ఈ విధంగా పదునైన ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్ ప్రజాపక్షం వహిస్తూ.. పాలకులకు ముచ్చెమటలు పట్టిస్తుండటంతోనే విలీనమంటూ కొంత మంది ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

పది ఎంపీ స్థానాలివ్వండి, తెలంగాణ శక్తి ఏమిటో చూపిస్తానని పార్లమెంట్ ఎన్నికల వేళ కేసీఆర్ పదే పదే చెప్పారు. అప్పుడు ఆయన మాటలను తెలంగాణ సమాజం సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఫలితంగా కేంద్ర బడ్జెట్‌లో మనకు తీవ్ర అన్యాయం జరిగింది. రెండు జాతీయ పార్టీలను నెత్తిన పెట్టుకున్నా తెలంగాణకు ఒరిగిందేమీ లేదు. 16 మంది ఎంపీలున్నా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలైన టీడీపీ, జేడీయూల అండతో సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేసిన మోదీ.. ఏపీ, బీహార్‌లకు కాసుల వర్షం కురిపించారు. బీఆర్‌ఎస్‌ను కాదనుకొని మనల్ని మనమే మోసం చేసుకున్నామని దీన్ని బట్టే అర్థం చేసుకోవాలి. నాడైనా, నేడైనా, భవిష్యత్తులోనైనా తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది గులాబీ పార్టీయే. మరోవైపు 'కేంద్రంతో సఖ్యతగా లేకుంటే నిధులెలా వస్తా యి?' అని అప్పట్లో రాద్ధాంతం చేసిన రేవంత్.. సీఎం అయ్యాక మోదీని పెద్దన్నగా సంబోధిస్తూ భుజానికెత్తుకున్నారు. అయినప్పటికీ శూన్యహస్తమే మిగిలింది. రెండు జాతీయ పార్టీల లక్ష్యం అధికారమే తప్ప తెలంగాణ ప్రయోజనాలు కాదు. ప్రాంతీయ పార్టీల్లో బలమైన శక్తిగా ఉన్న బీఆర్‌ఎస్‌ను ఎదగనీయకుండా చేయాలన్నదే రెండు పార్టీల కుట్ర. అయినా కేసీఆర్‌కు ఇలాంటి కుట్రలను ఎదుర్కోవడం కొత్తేం కాదు. సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దిన నాయకత్వం కేసీఆర్‌ది.

**తెలంగాణ గొంతుక బీఆర్‌ఎస్ అధికారానికి దూరమవడంతో అవకాశవాదులు తెలంగాణపై పెత్తనం చెలాయించేందుకు మళ్లీ ఉవ్విళ్లూరుతున్నారు. పదేండ్లలో విశ్వనగరంగా మారిన హైదరాబాద్, సహజ సంపదల గని తెలంగాణపై కుట్రలు మొదలయ్యాయి. తెలంగాణలో టీడీపీ పూర్వవైభవం కోసం అర్రులు చాస్తున్న చంద్రబాబు మాటలే అందుకు నిదర్శనం. ఇప్పటికైనా తెలంగాణవాదులు సంఘటితం కావాలి. లేదంటే అవకాశవాద రాజకీయాలకు తెలంగాణ వేదికగా మారే ప్రమాదం ఉన్నది.**

తెలంగాణ రాష్ట్ర సాధనే తన అంతిమ లక్ష్యమంటూ, త్యాగానికి సిద్ధపడి తెలంగాణను కేసీఆర్ సాధించారు. అరిగోస పడి సాధించుకున్న తెలంగాణను పాలకుడిగా సుసంపన్నం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్లలా పరుగులు తీయించారు. త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ ఇప్పుడు కుక్కలు చింపిన విస్తరిగా మారే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది.

**తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ఎజెండాగా సాగుతున్న కేసీఆర్ నాయకత్వంపై దుష్ప్రచారం చేసి, అబద్ధపు హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ పాలకులు ఇప్పుడు మరిచారు. నాడు రారాజులా బతికిన రైతులు నేడు తిప్పలు పడుతున్నారు. వరికి బోనస్ బోగస్‌గా మారింది. రుణమాఫీ మాయాజాలంతో లక్షల మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రతీ పల్లె కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నది.**

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన సాధారణ ప్రజలే కాదు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా కేసీఆర్ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. మోత్కుపల్లి నర్సింలు, బక్క జడ్సన్ సహా చాలామంది నేతలు కేసీఆరే తెలంగాణ రక్షకుడని చెప్తున్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి, సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేసిన కొందరు ఇప్పుడు కేసీఆర్‌ను తల్చుకుంటున్నారు. నాడు కాంగ్రెస్ రెచ్చగొట్టిన నిరుద్యోగులే నేడు ఆ పార్టీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారు. ప్రజాభవన్ ముందు కంచెలు తొలగించామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ సర్కార్ నేడు తెలంగాణ అంతటా పదునైన ముళ్ల కంచెలను వేసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను కాదనుకొని తప్పు చేశామనే భావన సబ్బండ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

ఈ నేపథ్యంలో అవకాశవాదులకు తెలంగాణలో చోటిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుంది. వ్యక్తులను మోసే పార్టీలకు కాకుండా.. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పని చేసే బీఆర్‌ఎస్‌ను ఆదరించాల్సిన అవసరమున్నది. తెలంగాణ ఉనికికి, అస్తిత్వానికి ముప్పు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సబ్బండవర్గాలు కేసీఆర్ వెంట నడవాలి.